# విషాదిగింది!

రచన :
శ్రీ తుమ్మల దాదా రెడ్డి.

ముసలాడిలా వంగింది వేప చెట్టు. దాని నీడలోన చీట్ల పేకలాడుతున్న రిక్షావాళ్ళ పెద్దనుండి బీడీల పొగ గుప్పు గుప్పున వస్తుంది రైలు ఇంజనులోంచి వచ్చినట్లు. వారి నోళ్ళు ఎర్రగా రక్తం త్రాగిన రాక్షసుల నోళ్ళలా ఉన్నాయి పాన్‌లు తిన్నందుకేమో. వారి కళ్ళు ఎర్రగానున్నాయి నిద్ర లేకపోవడంవలన కావచ్చు. మనకుమాత్రం తాగినవారి కళ్ళు లాగే అగుపిస్తాయ్, వారిముందు చిల్లర పైసలు చిందులేస్తున్నాయి, పేకముక్కలు అందరి చేతుల్నీ అలంకరించాయి. అందరి మొఖాల్లో ఒకటే తపన గోచరిస్తుంది. అదే డబ్బు సంపాదించాలి అన్న తపన. ఎలాగైనా సరే రిక్షా ఓనరు కిచ్చే కిరాయి సంపాదించాలి అచ్చట కూర్చొని ఉన్నవారందరికీ సేటు సీతయ్య సింహంలాంటివాడు. కాదు కాదు గాడిదలాంటివాడు గాండ్రిస్తాడు. వెధవ నా కొడకా రిక్షాకిరాయి ఇచ్చి మాట్లాడు అని తరిమేస్తాడు. వేగంగానే ఇంకెన్నో ఉరుముతాడు. ఆ ధాటికి తట్టుకోలేని జీవాలు తల్లడిల్లి పోతాయి. సిటీ బస్సులుండబట్టి రిక్షా ఎక్కేవాళ్ళు తక్కువైనారు. రిక్షా లెక్కేవారికి బస్సు లున్నాయి, కాకపోతే ఆటో లున్నాయి. కాని రిక్షా తొక్కేవారికి మరో బ్రతుకు తెరువు కాన రావడంలేదామె. గురవనికి గుండె నిండా గుబులు. ఉన్న రెండు రూపాయల్లో మిగిలింది అర్ధ రూపాయి. రిక్షా కిరాయి కట్టేది ఎలా? పూటకు బియ్యం తెచ్చుకోవడం ఎలా? కట్టుకొన్నదానికి కడుపు నొప్పి మందు కొనుక్కోనే దెలా? ఉన్న అర్ధ రూపాయి అయిపోతే మళ్ళీ ఆట ఆడేది ఎలా?

ఇన్ని యోచనలు గిర్రుమంటున్నాయి. బుర్ర వేడెక్కింది. పెరిగిన గడ్డం చిరిగిన దుస్తులు ముఖంలో దీనత్వం. గురవయ్యకు గారపళ్ళ సావుకారి గాండ్రింపులు గుర్తొస్తున్నాయి ఏంరా దొంగరండా కొడకా! నీకు పేకాడేందుకు డబ్బు దొరుకుతుంది కాని రిక్షా కిరాయి చెల్లించేందుకు ఉండదా? అని దమాయిస్తే సమాధానం ఏం చెప్పాలి "ఛీ! నేను ఇక ఆడను ఈ ఆటతోనే నా బ్రతుకు చీకటి నోటిలోకి చొరబడిపోయింది. వెలుగు చూడాలనుకొంటే నా బ్రతుకు మరోమలుపు మలగాలి."

"నేనెందుకిలా మారానా!" ఈ యోచన ఉన్న అర్ధరూపాయి పోయిన తర్వాత వచ్చింది. గురవయ్య కడుపులో పేగులు గుర్రమంటున్నాయి. కళ్ళు తిరుగుతున్నాయి. అతనికి ఆ ప్రదేశమంతా కుళ్ళుగా తోచింది. జ్ఞానోదయం అయ్యింది. ఇకముందెన్నడూ ఆడనని లేని దేవునిపై ఒట్టు చేసాడు. మొగడు చచ్చిన తర్వాత ముండ బుద్ధిమంతురాలైనట్లు గురవయ్య ఉన్న రెండు రూపాయలయిపోయిన తర్వాత ఇక ఆడవద్దనుకొంటున్నాడు. భారంగా కదిలాడు రిక్షా పట్టుకొని. ఎలాగైనా సరే డబ్బు సంపాదించాలి, సవారీ దొరుకుతుందేమోనని చుట్టూ కలియ జూశాడు. సర్కారు దవాఖాన ముందు జనం గుమిగూడి ఉన్నారు. ఒకావిడ ముఖంపై కుంకుమ చెదిరింది. కన్నీరు కాల్వలై ప్రవహిస్తోంది, ఆవిడ అఘోరిస్తుంది,

చుట్టూ ఆమె పిల్లలు అరుస్తున్నారు. అచట వాయ్యో! వాయ్యో! అన్న అరుపులు అధికమయ్యాయి. జనమంతా ఎగబడి చూస్తున్నారు గారడీవాళ్ళ ఆటను చూసినట్లు. కొందరు సాదు సమానులు సానుభూతి పలుకుతూ దాటిపోతున్నారు. ఆవిడ దుఃఖం రెచ్చిపోతుంది.

చలిమెలోని ఊటలా చెమట ఉబికి ఉబికి వస్తుంది. పసికూన పాలకోసం పాకులాడుతున్నాడు. మరో కూన ఆకలి ఆంటూ బొబ్బపెడుతోంది. అదే తరుణంలో గురవయ్య బుర్రలో మెరుపులా ఆలోచన తళుక్కుమంది. ఆశ జనించింది. సవారి దొరికే సూచన కనిపించింది. "అక్కా! ఏడుపకు, ఏడ్చి ఏం లాభం? చచ్చినవా రెలాగూ తిరిగి రారు. మనకన్నా ఆ సచ్చినోళ్ళే ఎంతో అదృష్టవంతులు, ఏడువకు ఆ పిల్లలను చూడు ఎలా తల్లడల్లుతున్నారో! నీవే ఇలా బెదిరిపోతే వాళ్ళ గతేం కావాలి ఆలోచించు, ధైర్యం తెచ్చుకో" గురవయ్య గుక్క తిప్పుకోకుండా చెప్పాడు. శోకం ఎక్కువయ్యింది, శోకాన్ని చీల్చుకొంటూ "అన్నా! ఈ శవాన్ని మా ఊరు చేర్పించే ఏర్పాటు చూడండి" అంది ఆర్ద్రతంగా. గురువయ్య గుండెలో సంతోషం బుసలుకొట్టింది, సవారీ దొరికిందని మురిసిపోయాడు, "ఏ ఊరెళ్ళాలి" అని ఆత్రంగానే అడిగాడు గురవయ్య, ఇచటికి మూడు మైళ్ళుంది. మా ఊరు రామాపురం, ఓహో అచటికేనా? పదిహేను రూపాయలవుతాయి అని (రిక్షావాడి లాగే) చెప్పాడు. మారు మాట్లాడితే లాభముండదని పసికట్టిన శోకమూర్తి అలాగే ఇస్తాం అని చెప్పింది, శవాన్ని రిక్షాలోకి ఎక్కించుకొని భయలుదేరాడు సంబరంగా, రిక్షా ఆగింది, జనం మూగింది, బెల్లం చుట్టూ ఈగల్లాగ. అయ్యో! పాపం అని అననివారెవరూ లేరు, నిన్న శివం ఆస్పత్రికి పోతానని అప్పు అడిగితే అప్పూ లేదూ గిప్పూ లేదూ అని కొక్కిరించిన కోర మీసాల (కోటి మోసాల) సేటు కూడా పాపం మాట తప్పని మంచి మనిషి అని శవాన్ని ప్రశంసించాడు పాపం గౌరి మొగడు చచ్చాడట అంటూ. ఊరూ వాడా కదిలారు, గురవయ్యకు తొందర పుట్టింది, నా డబ్బు ఇచ్చేయ్ పోవాలి అన్నాడు కటువుగా, ఆవిడ అందరి కాళ్ళూ వేళ్ళూ పట్టుకొని డబ్బుచేసి ఇచ్చింది గురవయ్యకు. రిక్షా మలిపి ఎక్కాడు, జవకొద్దీ తొక్కాడు (స్వర్గం మెట్లవద్దకు) సారాకొట్టు వద్దకు, సేరు సీసా కాళీచేసి విసిరాడు, ఇక తప్పటడుగులు వేస్తూ రిక్షా చేరాడు, గురవయ్య మాటల్లో పద్నాలుగు భాషలూ అగుపడుతున్నాయ్. రాళ్లు రప్పలు బెదిరేంత స్పీడుగా రిక్షా నడుస్తోంది, సేటు మొఖాన కిరాయికొట్టి రిక్షా అప్పజెప్పాడు, అప్పుడే లీలగా గుర్తొచ్చింది ఓ ఇల్లు ఉందని అందులో (రోగపు) పెళ్ళాం ఉందని, ఇపుడు పెళ్ళాం కావాలి. వాళ్ళు తిమ్మిరెక్కినట్లుంది గురవయ్యకు. గబగబా నడిచాడు రాళ్ళను తన్నుకుంటూ ఇల్లుచేరాడు. పిల్లల ఏడుపు వినవస్తుంది, వెధవ పోరగాండ్లు ఎప్పుడూ ఏడుపేనని తిట్టుతూనే తలుపుతట్టాడు. కడుపునొస్తుందని అవ్వ నిద్రపోయింది లేవడం లేదంటూ చిన్నోడు చెప్పాడు, గురవయ్య లేపుదామని చూసేసరికి చీమలు బార్లుకట్టాయి గురవయ్య తాగిన సేరు సారా ఆవిరై కన్నీటి కాల్వగా సాగింది. ఇంకేం గురవయ్య నిషాదిగింది.